# నిరంజనం చదువు

కుమారస్వామి కళాశాలలో నిరంజనానికి మొదటిలిస్టులో సీటు వచ్చింది. మూడవలిస్టులో పట్టాభికీ, రఘుకూ వచ్చింది.

ఆ కళాశాల క్రిందటి శతాబ్దంలో స్థాపించినది. అక్కడి ప్రొఫెసర్లు సగం మందికి పైగా విదేశీయులు ఉండేవారు. బ్రిటీషువారి కాలం దాటిన తరువాత విదేశాలకు వెళ్ళి అధ్యయనంచేసి డిగ్రీలు తెచ్చుకున్నవారికి మాత్రమే ఆ స్థానాలకు అర్హత ఉండేది. రానురాను అంతా స్వదేశీయులు ఆ స్థానాలన్నిటికీ అర్హతలు సంపాదించుకుని నియుక్తులైనారు.

తెలుగుభాషకు మాత్రము మొదటినుంచీ సంస్కృతాంధ్రభాషలలో నిష్ణాతులైనవారు నియమింపబడుతూ ఉండేవారు.

ఆ కళాశాలలో సీటు లభించటము సామాన్యం కాదు. సీటు వచ్చిందంటే గొప్ప విశేషము. ఆ ఘనత ఇప్పటికీ నిలిచే ఉంది.

అంత గొప్ప చరిత్రగల కళాశాలలో నిరంజనానికి సీటు వచ్చిందంటే అతడిని కన్నవారికి కొండంత సంతోషం కలిగి ఉబ్బి తబ్బిబ్బయ్యారు. వాళ్ళకు రాకపోయినా అతడి సహాధ్యాయులంతా అతడికి బ్రహ్మరథం పట్టారు. విద్యార్థి లోకంలో అతడిపట్ల ఎనలేని గౌరవం ఉందంటే ఆ సీటు మహిమేనంటారు కొందరు తెలిసినవాళ్లు. పట్టాభికీ రఘుకీ ఆ ఘనత వచ్చిందంటే అందరికీ ముందు ఆశ్చర్యం కలిగింది.

క్లాసులో ముందుసీట్లలో కూర్చునేవాళ్లు సహజంగా మొదటితరగతికి చెందినవారై ఉంటారని ఒక అంచనా. ఉపాధ్యాయుడి కంటికెదురుగా ఉంటారు కనుక ఏకాగ్రతతో కాలు ఊపకుండా తలతిప్పకుండా ఉంటారు. వెనకసీట్లలో కూర్చున్నవాళ్లు చిలిపిపనులు చేసేఅవకాశం చాలా ఉంది. కాగితాలమీద బొమ్మలువేయటం, ఉండలుగాచుట్టి మరొకరిమీదికి కాలితో ఫుట్‌బాలులా ప్రయోగించటం-నవలలను

ముందుపెట్టుకోవటం దృష్టి దానిమీదనేఉంచి చదవటంవంటి పనులు కళాశాలల్లో జరుగుతూనే ఉంటాయి.

ఆ క్లాసులో విద్యార్థులమీద ఉపాధ్యాయులకు మంచి అభిప్రాయ మున్నదని మొదటి రెండువరసల్లో కూర్చున్నవాళ్ళనుకుంటారు. ఆ తరువాత తరువాత వరసల్లో కూర్చున్నవాళ్ళు తమనుగురించి ఎవరేమనుకున్నా లెక్కచేయని రకం.

"సార్. మరీ అంత స్ట్రిక్టుగా ఉంటే ఎట్లాసార్! ఈ వయసులో కాకపోతే ఇంకెప్పుడుంటుంది చిలిపితనం? ఈసారికి వదిలెయ్యండి సార్" అని ధైర్యంగా అనే రకాలు కూడా ఉంటాయి.

తెలుగుమాస్టారి క్లాసులో అల్లరి తప్పనిసరి. అందరూ చిలిపి అల్లరి చేస్తారు.

"మాస్టారెక్కడికి పోతారు?" అనుకుంటాడు ఆ గ్రూపులో ఉన్న నిరంజనం. అతడిని ఆయన ఇంటికి రమ్మంటూ ఉంటాడు. రామభక్తుడి మాదిరిగా వెళ్ళి స్తంభానికి అనుకుని నిలబడతాడు- అదీ తెలుగుమాస్టారి విషయంలో.

"అలా నిలబడతావేమోయ్. కుర్చీమీద కూర్చో. ఉండు లోపలికెళ్ళి కప్పు కాఫీ తీసుకువస్తా" లోపలికెళ్ళి కప్పు అతడిచేతి కందించాడు.

"ఏమోయ్ నిరంజనం ఏమిటి కబుర్లు? నీతో ఒక మాట చెప్పాలనుకుంటున్నాను చాలారోజులనుంచి. ఏమిటంటే - నీ దస్తూరి చాలా బాగుంటుందోయ్. నా రచనలు కాపీచేసిపెట్టవోయ్!" అన్నాడు.

మాస్టారు చేసే మర్యాదలకు నిరంజనం ఆగలేకపోతున్నాడు. ఆయనంతటి ఘనుడు తనకు - ఒక విద్యార్థికి స్వయంగా కాఫీకప్పు తెచ్చివ్వటమే కాకుండా తననోపని చేసిపెట్టమని ప్రాధేయపూర్వకంగా అడుగుతున్నాడు.

"మాస్టారూ! మీరు అలా అడగకండి ఆజ్ఞాపించండి. ఏపని చెయ్యమన్నా క్షణాలమీద చేసిపెడతాను" అన్నాడు వినమ్రతతో.

"ఏంలేదోయ్. ముందు ఒక నవల అర్జంటుగా కాపీచేసిపెట్టు. తరువాత ఒక్కొక్కటే ఇస్తూఉంటాను. ఏమిటో- రాయటమంటే రాయొచ్చుగాని కాపీ

చెయ్యటమంటే విసుగుపుడుతుందోయ్. ప్రతిదానికీ ఒక కాపీ మనదగ్గరుండాలి. ఏమంటావ్?"

"అవునండీ. పేపర్లవాళ్ళ దగ్గర పోతే కష్టమండి. మీకెందుకు? మీ రచన లన్నీ నాచేతికివ్వండి. అన్నీ కాపీచేసి మీకు తెచ్చిస్తాను" అన్నాడు రామబంటులా.

నిరంజనం అన్నదే తడవుగా మాస్టారు కట్టలుకట్టలుగా తెచ్చి పడేశారు. వాటినన్నిటినీ కట్టకట్టి ఇంటికి తీసుకువచ్చాడు. రాత్రిళ్ళు వాటిని ఒక్కొక్కటే తన అందమైన దస్తూరితో కాపీచేయటం, మాస్టరుగారికి అందచేయటం ఒక కార్యక్రమమైపోయింది నిరంజనానికి. అప్పుడప్పుడు మాస్టరుగారిభార్య చెప్పిన చిన్న చిన్న పనులు చేయటం కూడా తటస్థపడుతూ ఉండేది.

ఒకరోజు రాత్రి మాస్టారు రచించిన నవలను కాపీచేస్తున్నాడు. అతడికి ఒళ్లు జలదరించింది.

"మాస్టారెంత రసికులో? శృంగారం గుప్పించేస్తున్నారు" అతడి మనసు గతితప్పినట్లవుతోంది. అయినా ప్రాణాలు బిగపట్టుకుని పని పూర్తిచేయటానికే సంకల్పించాడు.

"నిరంజనానికి ఫస్టుక్లాసు ష్యూర్" అని పేరుపడిపోయింది క్లాసులో.

"మాస్టారు కవిత్వమేనా? ఇంకేవయినా రచనలు చేస్తారా?" మిత్రులు నిరంజనాన్ని ప్రశ్నించి, విషయాన్ని రాబట్టాలని చూస్తారు.

నిరంజనం మాత్రం మాస్టారికీ తనకూ ఉన్న ఈ సంబంధాన్ని బయట పెట్టడు. ముత్యాలవంటి అక్షరాలు పైపుచేసినట్టుగా రాసి పేపర్లో చుట్టి ఆయనకు అందిస్తాడు చాటుగా.

"ఇదేమిటి మాస్టారూ? వీక్లి చూశారా? నేను కాపీచేసిన మీ నవల ప్రారంభమయింది. ముకుందం అన్న పేరుతో అచ్చవుతున్నది. మీరెక్కడయినా పారేసుకుంటే ఆయనకు దొరికిందా?" ఆందోళనతో మాస్టారికి అన్యాయం జరిగిందన్న బాధతో మాస్టారింటిముందు వాలాడు నిరంజనం.

ఆయన ముసిముసి నవ్వులు నవ్వుతూ తెలుసునన్నట్టుగా తలఊపారు.

ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసుకుని "అయితే అది మీ పెన్‌నేమ్‌అన్నమాట! అవునా మాస్టారూ?"

మాస్టారు కాదనలేదు.

నిరంజనం అప్పుడప్పుడు చేతులుకట్టుకుని మాస్టారిముందర నిలబడతాడు. ఆయన ఎదుట సాధారణంగా కుర్చీలో కూర్చోడు. ఒకవేళ కూర్చున్నా ఒదిగి ఒదిగి కూర్చుంటాడు ఏదో అర్థిస్తున్నట్టుగా.

అతడి మనసు గ్రహించినట్టుగా మాస్టారు అనుగ్రహిస్తానన్నట్లు చూస్తారు చిరునవ్వుతో.

అట్లా గురుశుశ్రూషచేసి ఎం.ఏ. పూర్తయేవరకూ ఆ భక్తిశ్రద్ధలూ భయభక్తులూ నిలుపుకుని, క్లాసుతో కాలేజిబైటికి వచ్చి, ఆ మాస్టారి రచనలమీదనే పరిశోధనావ్యాసం రాయాలని నిరంజనం సంకల్పం.

రాత్రి పన్నెండు గంటలవరకూ 'కలవభామ' నవల కాపీచేస్తున్న నిరంజనం ఆ రోజుకి ఇక చాలుననుకుంటూ కలంమూసి, కాగితాలు సర్ది పక్కమీదికి ఒరిగాడు. ఎంతసేపటికీ నిద్రరాదు. ఆ కలవభామే కళ్ళల్లో కనబడుతోంది. కొలనులో తామరాకులమధ్య తల ఊపుతూ అందాలొలకబోసే కలవభామల మధ్య-నీళ్ళు ఎగజిమ్ముతూ - కలవభామలను చెదరగొడుతూ కొలను బీభత్సం చేసే జంటలూ, స్విమ్మింగ్ కాస్ట్యూమ్సులో సరస వినోదాలతో, నునులేతఎండలో కాలక్షేపం చేసే జంటలూ జలకాలాడుతున్నారు. వాళ్లలో ఒక మెరుపుతీగెలాంటి పిల్లి అందరి అరికాళ్ళూ గోకుతూ నీళ్లను చెదరగొడుతోంది. ఆ మెరుపుతీగె అతడిని నిద్రపోనివ్వటంలేదు. కళ్లముందర నిలిచి వేలితో బెదిరిస్తోంది కవ్వింపుగా.

'అయినా మాస్టారు ఇంత చౌకబారు శృంగారాన్ని గుప్పిస్తూ ఇలాంటి నవలలు రాయకపోతేనేం? ఆయనకు పేరుప్రతిష్ఠలు తక్కువయ్యా? కలంపేరుతో రాసి తన గౌరవానికి భంగం కలగకుండా, రచనచేసిన ఆనందాన్ని అనుభవిద్దామనా? ఆ నవల కాపీచేస్తుంటేనే తనమనసు ఎగిసెగిసి పడుతోంది? గిలిగింతలు పెడుతోందే? ఏం నవల? ఏం నవల?

నిరంజనం కళ్ళముందర అటువంటి సినిమాలెన్నో కదలాడాయి. మనసు ఉర్రూతలూగుతోంది. ఎగిసెగిసి పడుతోంది.

క్లాసులో నిరంజనం సీటు వెనకగా ఉంది. అతడు క్లాసులో గంభీరంగా ఉంటాడు. శ్రీకంఠం, వినాయకరావు, నిరంజనం ప్రాణమిత్రులు. ఈ ముగ్గురికీ మరో నలుగురు అనుయాయులు ఉన్నారు. వీళ్లు విద్యార్థిసంఘ ప్రతినిధులతో కలుస్తూ ఉంటారు. ఇతర కళాశాలలనుండి కూడా ప్రతినిధులు వస్తారు. ఉమ్మడిగా పాటకచేరీలు, నాటకాలూ, ఉపన్యాసాల పోటీలూ వంటి కార్యక్రమాలు జరుపుతూ ఉంటారు.

నిరంజనం, వినాయకరావు, శ్రీకంఠం వినయ విధేయతలతో మెలగుతూ అందరికీ ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తారు. విద్యార్థినులపట్ల గౌరవంగా ప్రవర్తిస్తారు. ఒకరి కష్టసుఖాలను ఒకరు అర్థంచేసుకుంటారు. పరస్పరమూ సహకరించుకుంటారు.

ఆ రాత్రి నిద్రపట్టని నిరంజనానికి కాలేజి వదిలిపెట్టివెళ్ళిన రఘు జ్ఞాపకం వచ్చాడు. అతడిని కలుసుకుని మాట్లాడి చాలారోజులైన దన్నట్లనిపించింది. అవీ వట్టి పలకరింపులే. అయినప్పటికీ ఈ మధ్య యెక్కడా అతడు కనబడటం లేదు.

రఘు దిలీపులపద్ధతి వేరు. క్లాసులో విన్నపాఠమే కాని ఇళ్ళల్లో చదవరు. చదువుమీద అంతగా ధ్యాస లేదు. ఎప్పుడూ సినిమాలూ షికార్లూ - ఒక్కొక్క రోజు కాలేజీకి రావటానికే తీరుబడి ఉండదు. అందులో దిలీప్‌కి తల్లిలేదు. మేనమామ యింట్లో ఉంటాడు. అత్తయ్య సరిగా చూడదు. మేనమామ పుస్తకాలకనీ, ఫీజులకనీ ఇచ్చిన డబ్బును ఆమె అతడిని బెదిరించి తీసుకుంటుంది. భోజనానికి అప్పుడప్పుడు ఇబ్బందిపడుతూ ఉంటాడు. బట్టలు సరేసరి. మాసిపోయి చినుగు పట్టి ఉంటాయి. కాని రఘు ధనికకుటుంబంలోనుంచి వచ్చినవాడిలా ఉంటాడు. ఎప్పుడు చూసినా కొత్తరకం బట్టలు వేసుకుని తిరుగుతూ ఉంటాడు. నోట్లో సిగరెట్, కళ్ళకు రంగుటద్దాలతో ఠీవిగా ఉంటాడు.

దిలీప్ కనబడినప్పుడల్లా "ఈ వేషంతోనా కాలేజికి వెళ్తావు?" తోటివాళ్ళు అసహ్యించుకుంటారు. ఆ కాలేజి చదువు బట్టలిస్తుందా? కడుపునిండా అన్నం పెడుతుందా? ఆ చదువుతో నీకు ఉద్యోగం రాదు" హేళనగా మాట్లాడి అతడిని నీరసపెట్టేస్తాడు. అసలే యిబ్బందుల్లో ఉన్న దిలీప్‌కు మరింత నిరాశా నిస్పృహా కలుగుతాయి.

"అయితే నన్నేంచెయ్యమంటావు?"

"అట్లా దారికిరా. నేను చెప్పినట్టు విను. ముందు ఈ డబ్బు తీసుకుని ఒక డ్రెస్సు కొనుక్కుని వేసుకురా. అట్లా ఫైవ్‌స్టార్ హోటల్‌కి వెళ్ళి భోజనంచేద్దాం. అప్పుడు నీకు బ్రతుకుతెరువు చూపిస్తాను.

రఘు చెప్పినట్టు చెయ్యగానే అతడికెంతో ఆత్మస్థైర్యం వచ్చినట్లయింది. ముందు కాలేజికి వెళ్లటం మానేశాడు. రఘుకు డబ్బు చేతినిండా ఎట్లా ఆడు తున్నదో కొత్తకొత్త డ్రెస్సులు ఎట్లా లభిస్తున్నాయో వారంరోజులలోనే గ్రహిం చగలిగాడు దిలీప్. ఎప్పుడూ రైల్వేస్టేషనులోనూ, ప్లాట్‌ఫారంలమీదనూ తిరు గుతూ ఉండటమూ ఏమి ఎరగనట్టుగా నాలుగుసార్లు తిరిగి అయిదోసారికి చేతి కందిన పెట్టె పట్టుకుని స్టేషనునుంచి పట్టాలమీదుగా అవతలికి వెళ్ళిపోవటమూ రఘుకు అలవాటయింది. హస్తలాఘవం కూడా నేర్పుతో చేయగలడు.

రఘుకు దిలీప్ శిష్యుడైపోయాడు ఆవారంలోనే. కొత్తకొత్త సినెమాలూ వింతవింత అనుభవాలకూ ఇద్దరూ బాగా అలవాటుపడ్డారు. చేతినిండా డబ్బు కన బడుతోంది.

ఆనాడు రఘు కనబడగానే నిరంజనానికి ప్రాణం లేచివచ్చింది.

"ఇంకా ఆ కాలేజీని అంటిపెట్టుకునే ఉన్నావా?" ప్రశ్నించాడు రఘు.

"డిగ్రీ చేతికి రావాలంటే కాలేజిని అంటిపెట్టుకోవాలి మరి."

"డిగ్రీ వస్తే ఉద్యోగం వస్తుందని నమ్మకం ఉందా?"

"అందరూ ఆశించినట్టు నేనూ ఆశిస్తున్నాను."

"జీవితమంతా ఆశిస్తూనే ఉంటావా ? ఇలాగే బ్రతుకుబండిని ఆశలతో ఈడుస్తూ ఉంటానంటావు. అంతేనా ?"

దీనికి ఏం చెప్పాలో నిరంజనానికి తోచలేదు.

"అంతకంటె ఏం చెయ్యమంటావు ?"

"నా దారిలోకిరా. నేను చెప్పినట్టు విను. చూడు దిలీప్‌ను? హాయిగా

బ్రతుకుతున్నాడు. పాత పద్ధతులతోనే పనులు జరగాలంటే ఎక్కడున్నవాళ్ళు అక్కడే ఉంటారు.

తల వంచుకున్నాడు నిరంజనం.

"రా. మాతోరా. కొన్నాళ్ళు ఉండిచూడు. నీకు నచ్చకపోతే నీదారి నీకు ఉండనేఉంది" భుజమ్మీద చెయ్యేసి తీసుకువెళ్లాడు ఒక పెద్ద హోటల్‌కి ఆ హోటల్లో మంచి భోజనం ఉంది. కిక్‌నివ్వగల వైన్ ఉంది. రంభ ఊర్వశుల వంటి అప్సరసలున్నారు. డబ్బు వెదజల్లితే ఏ.సి గదులున్నాయి.

మానవుడికి ఇంతకంటె కావలసిం దేమున్నట్టుగా రఘు, దిలీపుల ముఖాలు ప్రశ్నిస్తున్నాయి నిరంజనాన్ని.

తెల్లవారిన తరువాత నిరంజనం అనుకున్నాడు - రాత్రిళ్లు తననిద్ర పాడు చేసిన 'కలువభామ-మెరుపుతీగె' మాస్టారు నవలల్లోనిపాత్రలు దిగివచ్చి రాత్రంతా తనతోపాటు ఏ. సి. గదిలో ఉన్నారు.

రఘు ఎట్లాగయినా అనుభవంకలవాడు.

"నాయనా, నీవు రాత్రి ఇంటికి రాలేదు. నీ చెల్లెలు ఎదురు చూసిచూసి భోజనం చేసింది. ఎక్కడికి వెళ్ళావురా ?" తలుపు తీయగానే తల్లి వేసిన మొదటి ప్రశ్న.

"చెప్తానమ్మా, ముందు ముఖంకడుక్కుని కాఫీఇస్తే తాగి చెబుతాను."

కాఫీతాగి గ్లాసు కిందపెడుతూ "రాత్రంతా మాస్టారింట్లో ఉండి ఆయన వ్రాసిన పద్యాలన్నీ కాపీచేసి ఇచ్చి వచ్చానమ్మా."

మంచమ్మీద పడుకున్నాడు. తను వచ్చేటప్పుడు రఘుకు చెప్పి రాలేదు. ఏమనుకున్నాడో ఏమోననుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

"అమ్మా, అన్నయ్య ఎప్పుడొచ్చాడు? ఇప్పుడు నిద్రపోతున్నాడేమిటి?"

"రాత్రంతా ఏదో కాపీచేసి పెట్టాడట మాస్టారికి. పొద్దున్నే వచ్చాడు. నీ పని నీవు కానిచ్చుకో, స్నానంచేసి వెళ్లు."

మాల వెళ్ళిపోయింది. పదకొండుగంటలకు వచ్చి భోజనం చేసింది.

ఒకరితర్వాత ఒకరు పద్యాలు ఒప్పచెప్పారు. మాల అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పారు. లెక్కలు చేశారు.

"మీరు రేపటికి పన్నెండోఎక్కం నేర్చుకోండి. అప్పుడు కొత్తలెక్కలు చెబుతాను. ఈ పాఠం చూసి చదవండి.

వరసగా చదివారు. తరువాత మాల కొత్తపాఠంచెప్పింది. రెండు పద్యాలు నేర్చుకోమని చెప్పింది.

"టీచర్. మా అమ్మ ఈ డబ్బు మీకివ్వమంది" ఒకరి తరువాత ఒకరు చేతిలో పెట్టారు.

నిరంజనం తల్లి సీతమ్మ వచ్చేసరికి ఆరుగంటలయింది. గబగబా వడియాలు వేయించి అన్నం వండింది.

"మాలా, అన్నయ్య ఎక్కడికి వెళ్లాడు?"

"ఏమోనమ్మా. నాలుగింటికే వెళ్లాడు. అమ్మా, ఫీజు ఇచ్చారు తీసుకో అమ్మా."

"ఎప్పుడూ పెట్టేచోట పెట్టు."

రాత్రయిపోయింది. నిరంజనం రాలేదు. పదకొండుగంటలవరకూ ఎదురుచూసి మజ్జిగతాగి పడుకున్నది తల్లి.

ఉదయం ఎనిమిది గంటలవేళ నిద్రలేని ముఖంతో వచ్చాడు నిరంజనం.

అతడిని చూడగానే తల్లి "అబ్బాయీ రోజూ ఇట్లా చేస్తే నీ ఆరోగ్యం చెడిపోతుంది. పరీక్షలు దగ్గరకొచ్చాయన్న భయమైనా లేకుండా నీవు మాస్టారి కథలూ కబుర్లూ కాపీచేస్తూ కూర్చుంటావా?" చివాట్లు పెట్టింది.

"అమ్మా, నేను బాగా రాసినా నాకు మార్కులు ఎవరు వేస్తారు ? పైనుంచి వచ్చినవాళ్లు దిద్ది మార్కులువేస్తారు. ఈ మాస్టారు ఒక్కమాట వాళ్ళకు చెబితే చాలు- నాకు క్లాసువస్తుంది. అందుకేనమ్మా గురుశుశ్రూష చేస్తున్నాను " అంటూ స్నానం చెయ్యకుండానే మంచమ్మీద వాలాడు.

పదకొండు గంటలకు చెల్లెలు వచ్చింది. నిరంజనాన్ని భోజనానికి రమ్మని పిలిచింది.

అతడు కళ్ళుమూసుకుని పడుకున్నాడు. కాని నిద్రపోవటంలేదు ఇవాళ బయలుదేరి వస్తుండగా రఘు పట్టుకున్నాడు.

"నిన్నటికీ ఇవాల్టికీ నీ బిల్లు ఎంతో తెలుసా ?"

"తెలియదు."

"నీకు మార్గం చూపించాను. ఏర్పాట్లు చేశాను. డబ్బు సంపాదించేవిధానం చిలుకకు చెప్పినట్టు చెప్పాను. దిలీపును చూడు. మూడోనాటికి ఆరితేరాడు. వారానికల్లా తన బిల్లులు తను చెల్లించుకుంటున్నాడు. నీవేంచేస్తున్నావు? పగలు ఇంటికిపోయి నిద్రపోతున్నావు"

"నాకు దిలీపులా సంపాదించటం రాదురా రఘూ. నన్నేంచెయ్యమంటావు?"

"ఏంచెయ్యమంటానా? నీ బిల్లు నిన్ను చెల్లించుకోమంటాను."

"అంత డబ్బు నేను చెల్లించగలనా చెప్పు?"

"ఏంచెయ్యాలో నీవే ఆలోచించుకో. ఈ సాయంత్రానికి డబ్బు జేబులో వేసుకు రాకపోతివా-చూడు దాని ఫలితాన్ని అనుభవిస్తావు."

రఘు తనను ఇంకోమాట మాట్లాడితే కాలితో తన్నేటట్లున్నాడు. గబగబా ఇంటికి వచ్చి పడుకున్నాడు.

తను అంత డబ్బు ఎక్కడినుంచి తెస్తాడు ? ఇంత ఖరీదయిన జీవితమా అది ?

ఆలోచిస్తున్నాడు.

రఘు కాళ్ళకువేసుకునే షూజు తనకు నెలరోజుల తిండిఖర్చు. అతడి డ్రెస్సు నాలుగువందలకు దాటినది. అతడి వైన్ విమెన్ ఖర్చుతో తనకు మూడు జతల బట్టలు వస్తాయి. అతడెంత సంపాదిస్తాడో తనకంచనాలేదు. అతడివన్నీ ప్రిన్స్లీ హాబిట్స్.

ఇప్పటిమాటేమిటి ? డబ్బు తను ఈ సాయంకాలానికి ఎక్కడినుంచి తేగలడు ?

నాలుగు గంటలయింది. చెల్లెలు ఇంట్లో లేదు. తల్లివచ్చి మళ్ళీ ఎక్కడికో వెళ్ళింది.

నిరంజనం మెల్లగా లేచి వంటయింట్లోకి వెళ్ళి కాఫీ వేడిచేసుకుని తాగాడు. బియ్యండబ్బా మూత తెరిచాడు. కిలోకూడా లేవు. పప్పులడబ్బాలు ఖాళీ. ఒక చిన్న డబ్బాలో జొన్నరవ్వ ఉంది. రెండుకిలోలు సుమారుగా. కాఫీపొడి రేపటికి ఉంది. చక్కెర పావుకిలోఉంది. ఆ గూడంతా సర్దాడు. ఈ సరుకులతోనా అమ్మ రోజులుగడిపేది? అనుకుంటూ ఉండగా ఒక చిన్న పిడత- దాని మూతకు చిన్న సందూ ఉన్నదానిని ఊపి చూశాడు.

గలగలమన్నది.

వెంటనే పగలగొట్టాడు. గలగలమంటూ చిల్లర, రూపాయల కాగితాలు పదిరూపాయల నోట్లు కిందపడ్డాయి లెక్కపెడితే ఎనిమిదివందలకు పది తక్కువగా ఉన్నాయి.

వాటిని చూడగానే పావుగంట క్రింద బుద్ధి మారింది. కళ్ళు తళతళలాడాయి.

డబ్బు జేబులో వేసుకున్నాడు. పిడత ముక్కలు పెంటకుప్పమీదికి విసిరాడు. ఆరుగంటలకు తల్లి వచ్చేసరికి అతడిచేతిలో పుస్తకముంది.

"ఇంట్లో ఉన్నావో లేవోనని గబగబా వచ్చాను. ఇవాళ వకీలుగారు ఏదో సభలో మన మాల పాట ప్రోగ్రామ్ పెట్టారు. దానిని వాళ్ళే తీసుకువచ్చి దింపుతామన్నారు. అందుకని నేను వచ్చేశాను" అంటూ చిన్న గిన్నెతో బియ్యం పొయ్యి మీద పెట్టింది.

''మాల ప్రోగ్రాములు ఇవ్వగలిగిన స్థాయిలో పాట పాడగలదా ?''

"పాడుతుంది."

''నేనలా కొంచెంసేపు బైటికివెళ్ళివస్తానమ్మా" ఉన్నవాటిల్లో మంచి బట్టలు చూసి వేసుకుని వెళ్ళాడు.

రఘు మెట్లదగ్గరే కాపలా కాస్తున్నాడు నిరంజనాన్ని చూడగానే చెయ్యి పట్టుకుని తెచ్చావా?'' అడ్డంగా నిలబడ్డాడు లోపలికి రానివ్వకుండా.

"రఘూ. ఇవాళ దొరికినంత తెచ్చాను'' చిల్లరతో సహా చేతిలో పోశాడు.

"సరే ఇంటికెళ్ళు"

"అదేం? డబ్బు తెచ్చానుగా ?"

"నీక్రింద ఖర్చయిన డబ్బెంతో తెలుసా? రెండురోజులు! ఊహించుకో. ఊరికే వస్తే ఎంజాయ్ చేద్దామనా ? నీవు మా గ్రూపులో ఇమడవు." లోపలికి వెళ్ళిపోయాడు.

నిరంజనం ఇంటికి వచ్చేసరికి తల్లివచ్చి పదినిమిషాలయింది.

అందరూ భోజనాలకు కూర్చున్నారు.

"అదేమిట్రా. నీ ముఖం అలా చిన్నబోయిందేం? మాస్టారు యేమన్నా అన్నారా ?

"ఏంలేదమ్మా. నాకే పరీక్షలెట్లారాశానో అన్న భయం. క్లాసువస్తే సరి, రాకపోతే ఏంచెయ్యాలాఅని ఆలోచిస్తున్నా అంతే. నేను మాస్టారింటికి వెళ్ళలేదు''

తల్లి కమ్మటి కందిపొడి వేసి పెట్టిన భోజనంతో కడుపునిండింది గాని ఏదో వెలితిగా ఉంది.

పాటలనుగురించి తల్లీకూతుళ్ళ మాటలు నిరంజనం చెవిలో దూరటంలేదు. అన్యమనస్కంగా లేచి ఏవో పుస్తకాలు తిరగేస్తూ కూర్చున్నాడు.

అతడికి రఘుమాటలు అవమానకరంగా తలదీసేసినట్టుగా బాధిస్తున్నాయి. తను అతనిదృష్టిలో ఎందుకూ పనికిరానివాడు. అతడు తనకు ఘనమైనస్వాగతం డబ్బులేందే ఇవ్వడు. డబ్బు-డబ్బు డబ్బులేనివాడు ఎందుకూ పనికిరాడట!

అసలు తనెందుకు రఘును వెతుక్కుంటూ వెళ్ళాడు ?

నాలుగురోజుల క్రిందటివరకూ తన ఆదర్శాలూ ఆశయాలు ఏమిటి ? తను ఇటువంటివిషయాల కెంత దూరంగా ఉండేవాడు? తన డాక్టరేట్ పట్టా కన్న కలలు ఎంతలో కరిగిపోయాయి? పరీక్షలకు సరిగా చదవలేదు. అన్నిటికీ

మాస్టారే ఉన్నారని, ఆశలశిఖరాలను అందుకోవాలని అర్రులుజాచాడు. మాస్టారు ఉద్దేశ్యాలు వేరని పసిగట్టలేకపోయాడు. తను పాసయితే గొప్ప.

రెండురోజులు చవిచూసిన స్వర్గం - రఘు చూపిన చిన్నచూపు అతడిలో చాలా మార్పును తెచ్చాయి.

దీనికంతటికీ మాస్టారే కారణం అనుకుంటాడు. ఆ పిచ్చిరాతలు కాపీ చేసిచేసి, వాటిని నిజంచేసి చూడాలనేగా తను రఘుకోసం పాకులాడింది? తన తెలివీ నిగ్రహము ఏమయ్యాయి? రాతలకే తన మనసు చలించటం తన బల హీనత కాదా?

పక్కమీద ఎప్పుడో కన్నుమూశాడు. కలత నిద్రలో భయంకరమైన కలలు. ఉలికిపాటు. తెల్లవారినా పక్కమీదినుంచి లేవలేదు. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని పక్కకు తిరిగి పడుకున్నాడు.

వంటయింట్లో తల్లీకూతుళ్ళు హడావిడి పడుతున్నారు. వంటయింట్లో డబ్బా లన్నీ వెతుక్కుంటున్నారు. డబ్బాలన్నీ బోర్లా వేస్తున్నారు.

"అదికాదమ్మా. ఆ పిడత డబ్బాలచాటుగా పెట్టానమ్మా. అది నా నాలుగు నెలల సంపాదనమ్మా. నీవు వద్దంటున్నా రెండుచోట్ల సంగీతపాఠాలు చెప్పాను. నలుగురు పిల్లలకు నెలకు ఆరవయి రూపాయలు తీసుకుని ట్యూషను చెప్పాను. ఆ డబ్బంతా ఆ పిడతలో వేశాను". ఆమె ఏడుపుగొంతు వినబడుతోంది.

"ఇన్నాళ్ళనుంచీ ఆ పిడత అక్కడే ఉంది డబ్బాలచాటున. ఆ చోటు ఒక మాలకే తెలుసు. ఏమయిందీ?'' తల్లి గొల్లుమన్నది.

ఆ మాటలు వింటున్న నిరంజనానికి గుండె గతుక్కుమన్నది. పెద్ద డిగ్రీలు లేకపోయినా చెల్లెలు తన శక్తినంతా ఉపయోగించి డబ్బు సంపాదించి ఆ చిన్న పిడతలో దాచుకుంది. తను విలాసాలకు ఖర్చుచేశాడు. ఎంత ఘోరం? క్షమించరాని దా నేరం.

"అమ్మా మాలా! ఆ డబ్బు నీది కాదనుకో. దానంచేశాననుకో. కళ్లు తుడు చుకో తల్లీ. డబ్బాలో ఉన్న రవ్వపెట్టి ఉప్మాచెయ్యి. అన్నయ్యా నీవు తినండి. నేను అట్లా వకీలుగారింటికి వెళ్ళివస్తాను" వెళ్ళిపోయింది తల్లి.

తల్లి హెడ్‌మాస్టరుగారింట్లో పనిచేసేటప్పుడు మాల ఫీజు లేకుండా ఆ స్కూల్లో చదివి మెట్రిక్ ప్యాసయింది. తల్లి పైపనులు చేయటానికి మీనాక్షమ్మ గారింటికి వెళ్ళినప్పుడు ఆమెదగ్గర సంగీతం నేర్చింది.

ప్రస్తుతం తల్లి వకీలుగారింట్లో వంటచేసిపెడుతుంది. వాళ్ళిచ్చే నూట యాభై రూపాయలు ఇంటికి తీసుకువస్తుంది. స్వంత ఊళ్ళో ఆస్తిపాస్తులు లేవు. రెక్కలకష్టంమీద మూడు ప్రాణాలు నిలవాలి.

"మాలా? అమ్మ ఎక్కడికెళ్ళింది? అడిగాడు నిరంజనం.

"వకీలుగారింట్లో వంటచేస్తుంది. తొందరగానే వస్తుంది. రాత్రిపూట వంటేగా? రవ్వతో ఉప్మాచేశాను. రాగిపిండితో గంజిచేశాను. రా పెడతాను" మాల లోపలికి వెళ్ళింది.

కాఫీపొడి అయిపోయింది కాబోలు. రోజు తనకుమాత్రం కాఫీఇచ్చి వీళ్ళిద్దరూ గంజి తాగుతున్నారా ?

ఈ పరిస్థితుల్లో తను చెల్లెలి కష్టార్జితాన్ని దొంగిలించాడు!

నిరంజనం తల భూమిలోకి దించుకుపోతోంది.

తను ఎం.ఏ. ప్యాసయినా కాకపోయినా సరే - ఏదో ఒక ఉద్యోగము చెయ్యాలి. తల్లిని వంటచెయ్యనివ్వకూడదు. చెల్లెలి అప్పు తీర్చాలి. తనూ ట్యూషన్లు చెప్పాలి.

మర్నాడే ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి ఆఫీసుకు బయలుదేరాడు తన పేరు రిజిస్టరు చేసుకోవటానికి.

తన పేరు రిజిస్టరు చేసుకోగానే ఉద్యోగం వస్తుందా? ఎన్నిసార్లు ఆఫీసుల చుట్టూ తిరిగాడు? తనమాదిరిగా ఎంతమంది ఆఫీసులచుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారో కంటితో చూస్తున్నాడు.

తనూ చెల్లెలిమాదిరిగా ట్యూషన్లు చెప్పాల్సిందేనా ?

ఆ మార్గం కాకపోతే ఇంకేముంది ?

ఎన్నాళ్ళు ఎంప్లాయిమెంటు ఆఫీసుచుట్టూ తిరుగుతాడు ?

పిలిచి ఉద్యోగమిచ్చే కాలం పోయింది.

తలలోని నరాలు చిట్లిపోయేటట్టు ఆలోచించి ఆలోచించి నిద్రలోకి జారుకున్నాడు.

మధ్యరాత్రివేళ ఉలిక్కిపడుతూ లేచాడు. ఎవరో అతడిని పైమెట్టు మీది నుంచి కిందికి తోసినట్లయింది. దెబ్బతగిలిందేమోనని తల తడిమి చూసుకున్నాడు. ఒళ్లంతా పట్టిపట్టి చూసుకున్నాడు. ఎక్కడా దెబ్బ తగల్లేదు.

అతడికి మరి నిద్రరాలేదు. కళ్ళుతెరుచుకుని కప్పువైపు చూస్తున్నాడు. అతడికి చాలా ఆశ్చర్యంగా ఉంది. తను పైనుంచి క్రిందికి దొర్లినమాట నిజం. కాని ఆ దెబ్బ ఎక్కడ తగిలిందో మాత్రం తెలియటంలేదు.